సాక్షి
నిజామాబాద్
శుక్రవారం ; 3 ; మార్చి ; 2023



కష్టపడితేనే విజయం

క్రమశిక్షణతో నిరంతరం చదివితేనే అంతిమంగా విజయం దక్కుతుందని యూకే కౌన్సిలర్ శేషేంద్ర శేషభట్టర్ పేర్కొన్నారు.

- 8లో ▸



టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

విద్యార్థులు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని ఏఆర్‌సీఐ డైరెక్టర్ నర్సింగరావు పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.4 /20.4

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం చల్లటిగాలులు వీస్తాయి. రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆస్తిపన్ను బకాయిలు రూ. 5.9 కోట్లు

- వసూలుకు మిగిలింది 29 రోజులే..



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మున్సిపాలిటీ ఆస్తిపన్ను బకాయిలు వసూళ్ల లక్ష్యం రూ. 5.9 కోట్లు ఉండగా, గడువు మాత్రం కేవలం 29 రోజుల మాత్రమే ఉంది. గడిచిన నాలుగు నెలల నుంచి ఆస్తిపన్ను వసూళ్లు చేస్తున్నప్పటికీ కేవలం రూ. 3.52 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. బోధన్ మున్సిపాలిటీలో 38 వార్డులు ఉన్నాయి. ఇందులో 19,106 ఇళ్లు, 650 పైగా వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. 2022–23కు గాను ఆస్తి పన్ను రూ. 8 కోట్ల 34 లక్షల టార్గెట్ ఉండగా ఇప్పటిదాకా రూ. 3.52 కోట్లు వసూలు చేశారు. పట్టణంలో పన్ను వసూళ్ల కోసం 7 టీంలు ఏర్పాటు చేశారు. ఒక్కో టీంకు రోజుకు రూ. 18.42 లక్షలు వసూలు లక్ష్యాన్ని ఉంచారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 31వ తేదీలోపు తప్పనిసరిగా వందం శాతం వసూళ్లు పూర్తి చేశామని పేర్కొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

నిజామాబాద్ అర్బన్ : మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇచ్చే ఉపాధి శిక్షణ కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మైనారిటీలు మహిళలు నిరుపేదలు విడాకులు పొందిన వారు అనాథలు, వితంతువులు మొదలైన వారికి వేతన ఉపాధి కల్పిస్తామన్నారు. గవర్నమెంట్ ప్రొడక్షన్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు కోసం కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మైనారిటీలు, ముస్లిం స్వచ్ఛంద సంస్థలు మొదలైన వారి నుంచి సెంటర్లు ఏర్పాటు కోసం ప్రతిపాదన ఆహ్వానిస్తున్నామన్నారు. ఈనెల 5వ తేదీన మైనారిటీ సంక్షేమ శాఖలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

5న టీఎస్పీఎస్సీ పరీక్షలు

సుభాష్‌నగర్ : టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5న అసిస్టెంట్ ఇంజినీర్, ఎంపీఎల్ అసిస్టెంట్ ఇంజినీర్, టెక్నికల్ ఆఫీసర్ అండ్ జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఇన్ వేరియస్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ రాత పరీక్షలు ఉంటాయని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో 10 పరీక్షాకేంద్రాల్లో రెండు విడతల్లో ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. అభ్యర్థి తన ఫొటో, పేరు విషయంలో తప్పులుంటే మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో గెజిటెడ్ సైన్‌తో పరీక్షకు హాజరుకావాలన్నారు. అభ్యర్థులు ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దని, షూస్ వేసుకొని రావద్దన్నారు. అభ్యర్థులను ఉదయం 9.45 గంటలు, మధ్యాహ్నం 2.15 గంటల తర్వాత పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని పేర్కొన్నారు. సందేహాలుంటే 08462–220183లో సంప్రదించాలన్నారు.

ప్రశాంతంగా సెమిస్టర్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి) : తెయూ పరిధిలో గురువారం ఉదయం జరిగిన పీజీ (ఎంబీఏ, ఎంసీఏ) 3వ సెమిస్టర్ పరీక్షల్లో 462 మంది విద్యార్థులకు గానూ 438 మంది హాజరు కాగా 24 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో 651 మంది విద్యార్థులకు గానూ 528 మంది హాజరయ్యారని, కంట్రోలర్ అరుణ తెలిపారు. గురువారం మధ్యాహ్నం బీఈడీ 3వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో 1,260మంది హాజరయ్యారన్నారు.


కొనసాగుతున్న విద్యుత్ ఉద్యోగుల నిరసన



నిజామాబాద్ నాగారం: తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ పిలుపు మేరకు గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి విద్యుత్ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగులు నిరసన తెలిపారు. జిల్లా జేఏసీ చైర్మన్ రఘునందన్ మాట్లాడుతూ..రాష్ట్ర జేఏసీ నాయకులను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రులు పిలిపించి మాట్లాడారని తెలిపారు. త్వరలో పీఆర్సీ అందజేస్తామని యజమాన్యం నుంచి పిలుపు వచ్చేవరకు నిరసన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రతి ఒక్కరు పిలుపు వచ్చే వరకు నిరసన ప్రదర్శన తెలియజేయడానికి రావాలని కోరారు. ఇప్పటికైనా యజమాన్యం తొందరగా చర్చలకు పిలిచి పీఆర్సీ, ఈపీఎఫ్ టు జీపీఎఫ్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిరసనలో జేఏసీ కన్వీనర్ బాలేష్ కుమార్, కో–చైర్మన్ గంగాధర్, కో–కన్వీనర్ తోట రాజశేఖర్ పాల్గొన్నారు.

15 ఏళ్ల జీవితం.. అప్పనంగా మెక్కేశారు

- బాధిత ఉద్యోగికి తెలియకుండా 15 ఏళ్లపాటు వేతనం డ్రా..
- విధుల్లోకి రానీయకుండా అడ్డుకున్నారు
- మరణానంతరం కుటుంబానికి బెనిఫిట్స్ ఇవ్వకపోగా సర్వీస్ బుక్ మాయం
- ఉద్యోగి తనయుడి పోరాటంతో డీఎంహెచ్‌వోపై కేసు నమోదు



1990లో ఇస్సాక్ పేరిట జీతం డ్రా చేసిన లెటర్



ఉద్యోగి తనయుడు ఫారూక్

సమాచారం ఇవ్వకుండా ఓ ఉద్యోగి నాలుగేళ్లపాటు విధులకు గైర్హాజరయ్యాడు. ఇదే అదునుగా తీసుకున్నారు అక్రమార్కులైన కొందరు అధికారులు.. అతడిని మళ్లీ విధుల్లోకి రానీయకుండా అడ్డుకున్నారు. ఇక్కడ చిత్రమేమిటంటే ఆ ఉద్యోగిని విధుల్లోకి తీసుకున్నట్లు రికార్డులు సృష్టించారు. ఏకంగా 15 ఏళ్ల పాటు అతని జీతాన్ని మెక్కేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో జరిగిన ఇంత హేయనీయమైన దారుణం ఆ ఉద్యోగి మరణానంతరం కుటుంబ బెనిఫిట్స్ కోసం అతని తనయుడి పోరాటంతో వెలుగుచూసింది.



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : దర్జాగా రూ.లక్షల్లో జీతం తీసుకుంటూ మంచి హోదా అనుభవిస్తూనే కక్కుర్తి మాత్రం వదులుకోవడంలేదు కొందరు అధికారులు, ఉద్యోగులు. చివరకు దీనస్థితిలో అవస్థలు పడుతున్న సాటి ఉద్యోగి కుటుంబం పట్ల ఏమాత్రం కనికరం లేకుండా అన్యాయం చేయడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇందుకు నిజామాబాద్ జిల్లా మెడికల్ అండ్ హెల్త్ విభాగం అధికారుల ప్రవర్తన నిదర్శనంగా నిలుస్తోంది. 1990 నుంచి ఏకంగా 15 ఏళ్ల పాటు యథేచ్ఛగా అక్రమానికి పాల్పడగా, చివరకు ప్రస్తుత డీఎంహెచ్‌వో మాత్రం ఏకంగా ఉద్యోగి సర్వీసు పుస్తకం మాయం చేయడం గమనార్హం. దీంతో డీఎంహెచ్‌వోపై కేసు నమోదు చేయాల్సి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. నిజామాబాద్‌కు చెందిన మహ్మద్ ఇస్సాక్ 1973లో ధర్పల్లి పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరాడు. 1985 వరకు రెగ్యులర్‌గా విధులు నిర్వహించాడు. 1985 మే నుంచి 90 రోజులు సెలవు పెట్టాడు. కాగా నాలుగేళ్ల పాటు సమాచారం లేకుండానే విధులకు గైర్హాజరయ్యాడు. ఐదేళ్లు దాటితే తొలగించే పరిస్థితి ఉండడంతో నాలుగేళ్ల తరువాత రీజాయినింగ్‌కు ఇస్సాక్ 1990 మార్చిలో లెటర్ పెట్టుకున్నాడు. అప్పటి డీఎంహెచ్‌వో జీవై నాయుడు ఇస్సాక్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకుని, విధుల్లోకి తీసుకోవాలని ధర్పల్లి సీహెచ్‌సీకి ఆదేశాలు ఇచ్చారు. అయితే ధర్పల్లి సీహెచ్‌సీలో చేర్చుకోలేదు. కాగా ఇక్కడ చిత్రమేమిటంటే ఇస్సాక్‌ను విధుల్లోకి చేర్చుకున్నట్లు అప్పటి ధర్పల్లి మెడికల్ ఆఫీసర్ వాజిదుల్ ఖాద్రి డీఎంహెచ్‌వోకు లెటర్ పంపారు. మరో విచిత్రం ఏమిటంటే ఇస్సాక్ పేరిట జీతం డ్రా చేయడం ప్రారంభమైంది. 2005లో ఇస్సాక్ చనిపోయేవరకు ఏకంగా 15 ఏళ్ల పాటు జీతం డ్రా కాగా, అతన్ని విధుల్లో మాత్రం చేర్చుకోకపోవడం విశేషం. డ్రా చేసుకున్న జీతం ఎవరు మెక్కేశారో ఇప్పటికీ రహస్యమే. ఇదిలా ఉండగా 2000 సంవత్సరంలో ఇస్సాక్ భార్య అజీజున్నీసా బేగం తన భర్తకు ఆరోగ్యం బాగా లేక బెడ్ రెస్ట్‌లో ఉన్నట్లు ఒక లెటర్ ఇచ్చింది. అయినా ఎవరూ పట్టించుకోలేదు. 2004లో సైతం తనను విధుల్లోకి తీసుకోవాలని ఇస్సాక్ లెటర్ పెట్టుకున్నాడు. చివరకు 2005 డిసెంబర్ 9న ఇస్సాక్ కామారెడ్డిలో ఓ ఆస్పత్రిలో మృతి చెందాడు. దీంతో రావాల్సిన బెనిఫిట్స్ కోసం అజీజున్నీసాబేగం 2006లో దరఖాస్తు చేసుకుంది. ఈ క్రమంలో మరో మాయాజాలం వెలుగుచూసింది. ఇస్సాక్ నిజామాబాద్‌లోనే మరణించినట్లు ఫేక్ డెత్ సర్టిఫికెట్ సృష్టించారు. 57 సంవత్సరాల వయస్సును 65 సంవత్సరాలుగా నమోదు చేయడం గమనార్హం. ఇదిలా ఉండగా కామారెడ్డి ఆస్పత్రిలో ఇస్సాక్ మరణించినట్లు ఇచ్చిన ఒరిజినల్ డాక్యుమెంట్‌ను సైతం 2008లో డీఎంహెచ్‌వో కార్యాలయంలో మాయం చేశారు.

పెన్షన్ ఫైల్ తయారు..

- 2012లో ధర్పల్లి సీహెచ్‌సీలో ఇస్సాక్ పేరిట సీనియర్ అసిస్టెంట్ రాధాకిషన్ పెన్షన్ ఫైల్ తయారు చేశాడు. 2013లో సదరు పెన్షన్ ఫైల్ ధర్పల్లి సీహెచ్‌సీకి రిటర్న్ పంపారు. 2015లో రాధాకిషన్ మరణించాడు. కాగా ఇస్సాక్ కుమారుడు ఫారూక్ డిగ్రీ పూర్తి కావడంతో తండ్రి ఉద్యోగ బెనిఫిట్స్ కోసం 2015 నుంచి ప్రయత్నాలు ముమ్మరం చేశాడు. 2022లో ప్రస్తుత డీఎంహెచ్‌వోను కలిశాడు. 2013లో ధర్పల్లి సీహెచ్‌సీకి రిటర్న్ పంపిన పెన్షన్ ఫైల్‌ను అడిగాడు. అదేవిధంగా 2014లో ధర్పల్లి సీహెచ్‌సీ నుంచి డీఎంహెచ్‌వోకు సబ్మిట్ చేసిన ఫైల్‌ను అడిగాడు. అది ఇవ్వకపోగా 2004లో ఇస్సాక్ పెట్టుకున్న లెటర్ కూడా లేదని డీఎంహెచ్‌వో తెలిపారు. మరోవైపు ఇస్సాక్ రీజాయినింగ్ లెటర్ తన కార్యాలయంలో ఉన్నట్లు డీఎంహెచ్‌వో 2022 జూలైలో వెల్లడించి తీరా అక్టోబర్‌లో తమ వద్ద లేదని తెలపడం గమనార్హం.
- అదేవిధంగా 2022 నవంబర్‌లో ఇస్సాక్ సర్వీస్ రికార్డు పుస్తకం తమ వద్ద ఉందని, సమాచారహక్కు చట్టం కింద అడిగిన అతని కుమారుడు ఫారూక్‌కు చూపించిన డీఎంహెచ్‌వో పోస్టు ద్వారా పంపుతానని చెప్పారు. తీరా 2023 జనవరిలో తమ వద్ద సర్వీస్ బుక్ లేదని తెలిపారు.

దీంతో ఫారూక్ గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో ఎం సుదర్శనంపై నిజామాబాద్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

డీఎంహెచ్‌వోపై కలెక్టర్ సీరియస్

- 'సాక్షి' కథనం నేపథ్యంలో కదలిక
- కలెక్టర్ హెచ్చరించినప్పటికీ మాయాజాలమే

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లా మెడికల్ అండ్ హెల్త్ విభాగంలో ఉద్యోగులే బినామీ పేర్లతో అద్దె ప్రాతిపదికన వాహనాలు ఏర్పాటు చేసుకున్న విషయమై గురువారం 'సాక్షి'లో 'అధి'కార్ల' దోపిడీ' శీర్షికన కథనం ప్రచురితం అయింది. స్పందించిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు డీఎంహెచ్‌వో సుదర్శనంను పిలిపించి సీరియస్ అయ్యారు. ఉద్యోగుల, వారి బంధువుల వాహనాలు తీసేయాలని ఆదేశించారు. దీంతో డీఎంహెచ్‌వో వాహనాల ఓనర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. అయితే ఈ సమావేశానికి కేవలం వాహనాల డ్రైవర్లు మాత్రమే హాజరయ్యారు. అసలు ఓనర్లు రాలేదు. హాజరైన డ్రైవర్ల వద్ద నుంచి ఫోన్లు అన్నీ తీసుకుని తన దగ్గర పెట్టుకుని అనంతరం మాట్లాడారు. వారు ఎక్కడ రికార్డు చేస్తారోనని భయంతో అలా చేసినట్లు సమాచారం. ఏదో తూతూమంత్రంగా సమావేశం ఏర్పాటు చేసి కాలం వెళ్లబుచ్చడం తప్ప కలెక్టర్ ఆదేశాలను ఏమాత్రం పాటించకుండా బేఖాతరు చేస్తున్నట్లు 'తెలంగాణ ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ అసోసియేషన్' నిజామాబాద్ యూనియన్ బాధ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు కల్పించాల్సిన ఉపాధిని ఉద్యోగులే కొల్లగొడుతున్నారని వాపోతున్నారు.

సాక్షి ఎఫెక్ట్..

మచ్చుకు కొన్ని..

- డీఎంహెచ్‌వో సుదర్శనం జూనియర్ అసిస్టెంట్ వినోద్ తల్లి పేరుమీదున్న స్విఫ్ట్ కారులో హైదరాబాద్‌లోని తనకుటుంబం వద్దకు వెళ్లి వస్తుంటాడు. ప్రభుత్వ పనులకు మాత్రం ఈ కారును వాడరు. కాగా వినోద్ ఇంటి నుంచి ప్రతిరోజూ డీఎంహెచ్‌వోకు మధ్యాహ్నం, రాత్రి ఆహారం సరఫరా చేస్తుండడం గమనార్హం. వినోద్ పేరుతో ఓ టీహబ్ వాహనం, వినోద్ భార్య పేరుపై మరో వాహనం అద్దె ప్రాతిపదికన పెట్టారు. ఇతనివి మొత్తం 3 వాహనాలు.
- లాల్‌జీ అనే పోలీసు కానిస్టేబుల్‌కు చెందిన ఓ వాహనం టీహబ్‌లో ఉంది.
- బాబీ అనే ప్రభుత్వ డ్రైవర్‌కు చెందిన 3 వాహనాలు అతని భార్య పేరిట ఉన్నాయి.
- జజ్జర్ వెంకటేష్ అనే కమ్యూనిటీ హెల్త్ అధికారి కుమారుడి పేరిట ఓ వాహనం ఉంది. విశేషమేమిటంటే ఇతని కుమారుడు విదేశాల్లో ఉంటాడు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్ నాగారం : జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి సుదర్శనం అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని బాధితుడు సమీర్‌హైమాద్ డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఏళ్లుగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో అద్దె ప్రాతిపదికన వాహనం ఉంచి వచ్చే డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు తెలిపారు. కరోనా సమయంలో రావాల్సిన అద్దె వాహనాల బిల్లులు ఇప్పటికీ రాలేదన్నారు. ఇదే శాఖలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగుల వాహనాలకు సంబంధించి డబ్బులు మాత్రం పెండింగ్‌లో లేవన్నారు. అడిగితే తమను అకారణంగా తొలగించారన్నారు. ఇప్పటివరకు తనకు డబ్బులు ఇవ్వలేదని, స.హ చట్టం ద్వారా డీఎంహెచ్‌వో ఆఫీస్‌లో అక్రమాలు, అవినీతికి సంబంధించిన వివరాలు తెప్పించామన్నారు. అధికారిపై చర్యలు తీసుకోని నాకు న్యాయం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న సమీర్‌హైమాద్

అపార్ట్‌మెంట్ పైనుంచి పడి నవ వధువు మృతి



పూర్ణిమ (ఫైల్)

ఖలీల్‌వాడి : నిజామాబాద్ నగరంలోని మూడవ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుధా హైట్స్ అపార్ట్‌మెంట్ పైనుంచి నవ వధువు పూర్ణిమ(26) ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందింది. నగరంలోని హమాల్‌వాడికి చెందిన కూన రమేష్ చిన్న కూతురు పూర్ణిమ అలియాస్ లక్ష్మిని సుభాష్‌నగర్‌కు చెందిన విశాల్‌తో రెండు నెలల క్రితం వివాహం చేశారు. పూర్ణిమ టీసీఎస్ కంపెనీలో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తోంది. భర్త విశాల్ బిల్డింగ్ కాంట్రాక్ట్ బిజినెస్ చేస్తున్నారు. గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఇంటి వంట పాత్రలు తీసుకువెళ్తుండగా కాలు జారీ ఐదవ అంతస్తు నుంచి కిందపడింది. తలకు బలమైన గాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందింది. అపార్ట్‌మెంట్ రెయిలింగ్ అతి తక్కువ ఎత్తులో ఉండటంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. భార్యాభర్తల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ చెప్పారు.



పూర్ణిమ పడిపోయిన అపార్ట్‌మెంట్ ఇదే

సాంగ్లీలోనూ పసుపునకు దక్కని ధర

- క్వింటాలుకు రూ. 8వేలు దాటని వైనం

మోర్తాడ్(బాల్కొండ): జాతీయ మార్కెట్‌గా ప్రసిద్ధి చెందిన సాంగ్లీ మార్కెట్‌లో పసుపుకు ధర అంతంతే ఉండటంతో రైతులు నిరాశ చెందుతున్నారు. సాంగ్లీ మార్కెట్‌కు వివిధ రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి వ్యాపారులు వచ్చి పసుపును కొనుగోలు చేస్తారు. కాస్మోటిక్స్ ఉత్పత్తి సంస్థలు కూడా సాంగ్లీ మార్కెట్‌పై ఆధారపడి ఉన్నాయి. నిజామాబాద్ మార్కెట్ కంటే సాంగ్లీ మార్కెట్‌లో క్వింటాలుకు రూ.1,500ల నుంచి రూ. 2 వేల ధర ఎక్కువ లభిస్తుంది. ఈసారి సీజను ఆరంభమైన నుంచి పసుపుకు క్వింటాలుకు రూ. 8 వేలకు మించి ఎక్కువ ధర పలుకలేదు. నిజామాబాద్ మార్కెట్‌లో తొలిసారిగా రూ. 7,800ల ధర నమోదైంది. ఈసారి క్వింటాలుకు రూ.10వేలు దాటుతుందని అందరు ఆశించారు. కాని అక్కడ కూడా పసుపు రైతుకు అడియాశే ఎదురైంది



సాంగ్లీకి తరలించడానికి సిద్ధం చేసిన పసుపు

అంబానీ, అదానీకి దోచిపెట్టేందుకే..

- అడ్డగోలుగా గ్యాస్ ధరల పెంపు
- బీజేపీకి బుద్ధి చెప్పాల్సిన సమయమిది..
- మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే బిగాల
- కట్టెల పొయ్యిమీద వంట చేస్తూ నిరసన

నిజామాబాద్‌నాగారం : కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ పేద, సామన్య మధ్యతరగతి ప్రజలకు సంబంధించి వంటగ్యాస్ ధరలు పెంచి అంబానీ, అదానీలకు దోచిపెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో బీఆర్ఎస్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా ఆధ్వర్యంలో కేంద్రం వంట గ్యాస్ ధరల పెంపునకు నిరసనగా ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ వంటగ్యాస్ ధరలు పెంచి సామాన్య ప్రజలపై భారం మోపిన బీజేపీ కేంద్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరికి నిరసనగా ధర్నాలు జరుగుతున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో సిలిండర్ ధర రూ. 50 పెంచినపుడు రోడ్డెక్కి ధర్నా చేసిన బీజేపీ నాయకులు ప్రస్తుతం రూ. 750 పెంచారన్నారు. బీజేపీ పాలనతో మళ్లీ కట్టెల పొయ్యి వైపు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని మంత్రి ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. రూ. 35 వేల కోట్ల సబ్సిడీ ఇస్తే గ్యాస్ ధర రూ. 450 వస్తుందని, కానీ మోదీ ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వకుండా ఇబ్బందుల పాలు చేస్తున్నారు. ప్రశ్నించే గొంతులను సీబీడీ, ఈడీలతో వేధింపులకు గురిచేస్తోందన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటే చూసి ఓర్వ లేకపోతున్నారన్నారు. రాష్ట్రంలో పండిన ధాన్యాన్ని కొనాలని అడిగితే నూకలు తినాలని అవమానపర్చారన్నారు.

ప్రజలు బతికేదెట్లా..?

గ్యాస్ ధరలు పెంచిన బీజేపీ ప్రభుత్వానికి తగిన రీతిలో ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉండాలని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా అన్నారు. ఇష్టారాజ్యాంగా ధరలు పెంచుకుంటూ పోతే ప్రజలు ఎలా బతుకుతారన్నారు. మోటార్లకు మీటర్లు పెడతామని చెప్పి దేశాన్ని ఆగం చేశారన్నారు. మేయర్ దండు నీతూ కిరణ్, జెడ్పీ చైర్మన్ విఠల్ రావు, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ నగర అధ్యక్ష, కార్యదర్శులు సిర్ప రాజు, యెనుగందుల మురళి, కార్పొరేటర్లు, తదితరులున్నారు.



ధర్నాచౌక్‌లో కట్టెలపొయ్యి మీద వంటకం.. గరిట తిప్పుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే బిగాల

'యాసంగి'కి యాక్షన్ ప్లాన్

- 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా
- 475 కొనుగోలు కేంద్రాలు అవసరం
- రూ. 2 కోట్ల పైచిలుకు గన్నీ బ్యాగులకు ఏర్పాట్లు
- సివిల్ సప్లయ్ కమిషనరేట్‌కు ప్రతిపాదనలు



కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం సేకరణ (ఫైల్)

సుభాష్‌నగర్ : యాసంగి ధాన్యం సేకరణకు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం యాక్షన్ ప్లాన్‌ను సిద్ధంచేసింది. సుమారు 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సేకరణ కోసం ప్రాథమిక సహకార సంఘాలు, మెప్మా, ఐకేపీ, డీసీఎంఎస్, తదితర సంస్థల ద్వారా 475 కొనుగోలు కేంద్రాలు అవసరమని భావిస్తున్నారు. 2 కోట్లకు పైచిలుకు గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు అంచనాలతో కూడిన ప్రతిపాదనలను జిల్లా అధికారులు సివిల్ సప్లయ్ కమిషనరేట్‌కు పంపించారు. ధాన్యం సేకరణ కోసం ప్రాథమిక సహకార సంఘాలు, మెప్మా, ఐకేపీ, డీసీఎంఎస్, తదితర సంస్థల ద్వారా 475 కేంద్రాలు అవసరమౌతాయని అధికారులు ప్రతిపాదించారు. గత వానాకాలం సీజన్‌లో 467 కేంద్రాల ద్వారా 5.85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. యాసంగి సీజన్‌లో ప్రైవేట్ వ్యాపారులు ధాన్యం కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపరు. దీంతో రైతులందరూ ధాన్యాన్ని ప్రభుత్వ కేంద్రాలకు తరలిస్తారు. 9 లక్షల మెట్రిక్ టన్నుల వరకు వస్తుందని అంచనా వేస్తున్నా.. 8 పైనే సేకరించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే సుమారు 2 కోట్లకుపైనే గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచేవిధంగా చూస్తున్నారు. లారీ ట్రాన్స్‌ఫోర్ట్ కాంట్రాక్టర్లతో త్వరలోనే సమావేశం నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. బస్తాల రవాణాను ఈ సారి పూర్తిగా ప్రక్షాళన చేసే అవకాశముంది.

జిల్లావ్యాప్తంగా..

జిల్లావ్యాప్తంగా 3.95 లక్షల పైచిలుకు ఎకరాల్లో వరి సాగు చేశారు. సుమారు 10.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు. కానీ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా మాత్రం 9 లక్షల మెట్రిక్ టన్నుల సేకరించే అవకాశముందని అంచనా వేస్తున్నారు. మొత్తం 305 వరకు రైస్‌మిల్లులున్నాయి. అందులో 75 బాయిల్డ్ రైస్‌మిల్లులు, 230 రా రైస్‌మిల్లులు ఉన్నాయి. కానీ సీఎంఆర్ 75 నుంచి 80 శాతం వరకు పూర్తయితేనే ధాన్యం అలాట్‌మెంట్ ఇవ్వాలనే ఉన్నతాధికారుల ఆదేశాలను తప్పనిసరిగా పాటిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. వరి, రుద్రూర్, చందూర్, తదితర మండలాల్లో మరో నెలరోజుల్లోనే పంటలు చేతికందే అవకాశముంది. మిగితా ప్రాంతాల్లో ఏప్రిల్ చివరి వారంలో కోతలు ప్రారంభం కానున్నాయి.

ప్రతిపాదనలు పంపించాం..



యాసంగి సీజన్ ధాన్యం సేకరణకు సంబంధించి ఏర్పాట్లపై అంచనాలతో కూడిన ప్రతిపాదనలు ఇటీవలే పంపించాం. కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. కొనుగోళ్లకు సంబంధించి ఉన్నతాధికారుల నుంచి ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– జగదీశ్ కుమార్, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ

క్లుప్తంగా

విద్యార్థుల సంఖ్య పెంచాలి



మోపాల్(నిజామాబాద్‌రూరల్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చర్యలు తీసుకోవాలని డీఈవో దుర్గాప్రసాద్ సూచించారు. మండలంలోని సిర్‌పూర్, న్యాల్‌కల్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా మన ఊరు – మన బడి ద్వారా చేపడుతున్న పనులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం, తరగతి గదుల్లో హాజరు శాతం, తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పదోతరగతి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని, ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని ఉపాధ్యాయులకు తెలిపారు. మన ఊరు – మన బడి పనులను త్వరగా పూర్తి చేసేలా చూడాలన్నారు. నాణ్యమైన భోజనం వడ్డించాలని, ఏమైనా ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హెచ్‌ఎంలు, కాంట్రాక్టర్లు ఉన్నారు.

నాణ్యమైన విద్య, భోజనం అందించాలి



బోధన్‌రూరల్(బోధన్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని 'ఫండమెంట్ లిట్రసీ అండ్ న్యూమరసీ' (ఎఫ్‌ఎల్‌ఎన్) రాష్ట్ర పరిశీలకులు సంజీవ్ కుమార్, శ్రీనాథ్, కిషన్‌లు పేర్కొన్నారు. మండలంలోని పెంటాకుర్దు జెడ్పీహెచ్, ప్రైమరీ ప్రభుత్వ పాఠశాలను గురువారం వారు పరిశీలించారు. విద్య, బోధన, మధ్యాహ్న భోజనం అమలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షల మోడల్ పేపర్లపై అవగాహన కల్పించారు. సీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారు మంచి ఫలితాలు అందించేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈవో నాగనాథ్, నోడల్ అధికారి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతోనే సమాజంలో గుర్తింపు

భిక్కనూరు: కుల సంఘాలు సభ్యులు ఐక్యతతోపాటు కులమతాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయాలని, అప్పుడే సమాజంలో గుర్తింపు వస్తుందని రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ చైర్మన్ కొమ్ముల తిర్మల్‌రెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మీదేవునిపల్లిలో గురువారం రెడ్డి సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.గ్రామంలో నిర్మిస్తున్న రెడ్డి కల్యాణ మండపం నిర్మాణానికి రూ.ఒక లక్ష విరాళంగా అందజేశారు. అనంతరం ఆయనను రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు సత్కరించారు. సంఘ ప్రతినిదులు నర్సరెడ్డి, రాజిరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రాంరెడ్డి, సుభాన్‌రెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

కష్టపడితేనే విజయం దక్కుతుంది

- యూకే కౌన్సిలర్ శేషేంద్ర శేషభట్టర్
- తెయూలో 'అంతర్జాతీయ వర్క్‌షాప్'



సమావేశంలో మాట్లాడుతున్న యూకే కౌన్సిలర్ శేషేంద్ర శేషభట్టర్

తెయూ(డిచ్‌పల్లి): క్రమశిక్షణతో నిరంతరం కష్టపడితేనే ఎవరికైనా విజయం దక్కుతుందని కౌన్సిలర్ అండ్ పేరెంట్ గవర్నర్ ఫర్ స్టేట్ ఫండెడ్ స్కూల్ (యునైటెడ్ కింగ్‌డమ్) శేషేంద్ర శేషభట్టర్ అన్నారు. తెలంగాణ యూనివర్సిటీలో గురువారం లా విభాగం ఆధ్వర్యంలో 'ఇంటర్ డిసిప్లినరీ ఎడ్యుకేషన్ సిస్టమ్ ఇన్ యూకే అండ్ ఇండియా: అపర్చునిటీస్ అండ్ అబ్‌స్టాకిల్స్' అనే అంశంపై ఒకరోజు అంతర్జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ప్రధానవక్తగా హాజరై ప్రసంగించారు. భారతదేశంతో పాటు యూరోప్, అమెరికా లాంటి దేశాలలో ఉన్నత విద్యావకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. యూకే లో బోధనతో పాటు ఆధునిక పరిశోధనలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారని తెలిపారు. విద్యార్థులు తమకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. నల్గొండ జిల్లాలో ఒక సాధారణ కుటుంబంలో పుట్టి ఇక్కడే ఇంటర్ వరకు విద్యనభ్యసించిన తాను ఉన్నత విద్య కోసం బ్రిటన్ (యూకే)కు వెళ్లినట్లు తెలిపారు. ఒక విద్యార్థిగా యూకేకు వెళ్లిన తాను కౌన్సిలర్ స్థాయికి ఎదిగిన తీరును వివరించారు. ఓటర్లందరూ ఇంగ్లీషు వారే అయినప్పటికీ నా సేవలకు ఆకర్షితులై ఓట్లు వేసి కౌన్సిలర్‌గా గెలిపించారని వివరించారు. అనంతరం లా విభాగం ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. తెయూ లా కాలేజ్ ప్రిన్సిపాల్, ప్రోగ్రాం కన్వీనర్ ప్రసన్నరాణి, హెచ్‌వోడీ స్రవంతి, బీవోఎస్ చైర్మన్ జెట్లింగ్ ఎల్లోసా, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

తెయూ సమాచారం

సాంకేతిక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

- ఏఆర్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ టాటా నర్సింగరావు
- తెయూలో జాతీయ సైన్స్ దినోత్సవం





నర్సింగరావును సన్మానిస్తున్న వీసీ రవీందర్.. సౌత్‌క్యాంపస్‌లో మాట్లాడుతున్న టాటా నర్సింగ్‌రావు

తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థులు ఎప్పటికప్పుడు మారుతున్న సాంకేతిక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఏఆర్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ టాటా నర్సింగరావు సూచించారు. తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ సెమినార్ హాల్‌లో గురువారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రధాన వక్తగా హాజరై ప్రసంగించారు. ఆధునిక శాస్త్ర, సాంకేతిక రంగాలలో నానో టెక్నాలజీ పెనుమార్పులు తీసుకువచ్చిందన్నారు. ప్రస్తుతం వివిధ శస్త్రచికిత్సల్లో నానో టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు తెలిపారు. తెయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ మాట్లాడుతూ.. తాను టాటా నర్సింగరావు కలిసి నానో టెక్నాలజీపై పరిశోధన చేశామన్నారు. అనంతరం నర్సింగరావును సన్మానించారు. ప్రస్తుతం నానో టెక్నాలజీ యుగం నడుస్తుందన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విద్యావర్ధిని, కన్వీనర్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

సౌత్ క్యాంపస్‌లో..

భిక్కనూరు: మండలంలోని సౌత్‌క్యాంపస్‌లో గురువారం ఫిజిక్స్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో సైన్స్‌డే నిర్వహించారు. కార్యక్రమంలో ఏఆర్‌సీఐ డైరెక్టర్ టాటా నర్సింగ్‌రావు పాల్గొని, మాట్లాడారు. విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా పరిశోధనలతో ముందుకు సాగితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. అబ్దుల్‌కలాం, సీవీ రామన్ లాంటి మహోన్నత వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వైస్ చాన్సలర్ రవీందర్‌గుప్త, ప్రిన్సిపాల్ కవితా తోరస్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల పరిశీలన



డిచ్‌పల్లిలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో విద్యార్థుల భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్జి పద్మావతి

ఖలీల్‌వాడి: డిచ్‌పల్లిలోని మైనారిటీ గురుకుల పాఠశాలను గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ జడ్జి పద్మావతి పరిశీలించారు. పాఠశాల్లో విద్యార్థులు బస చేసే గదులు, వంట గది, స్టోర్ రూం, భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హెడ్‌మాస్టర్ సయ్యద్ అర్షిఇక్బాల్, ఉపాధ్యాయ బృందం, డీఎల్‌ఎస్‌ఏ సిబ్బంది పాల్గొన్నారు.

మోపాల్ పోలీస్‌స్టేషన్ తనిఖీ



మోపాల్: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం రాత్రి నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను, పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. సీఐ నరేష్, ఎఎస్సైలు రమేష్, సర్ధార్‌సింగ్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త



పెద్దకొడప్‌గల్: సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా మోసపోతే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేయాలని ఏఎస్సై రాములు సూచించారు. స్థానిక వ్యవసాయ సహకార సంఘంలో గురువారం సైబర్ నేరాలపై ఆయన అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో మహిళలు, పిల్లలను టార్గెట్ చేసుకొని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. పోలీస్ సిబ్బంది అంజి, స్వప్న పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య



లక్ష్మి మృతదేహం

ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేట గ్రామంలో ఓ వివాహిత కుటుంబ కలహాల కారణంగా గురువారం కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎడపల్లి ఎస్సై పాండేరావు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని జానకంపేట్ గ్రామానికి చెందిన ఎడ్లకాడి లక్ష్మి (42), కుటుంబంలో ఇటీవల గొడవలు రావడంతో జీవితం మీద విరక్తి చెందింది. ఈక్రమంలో జానకంపేట్ గ్రామంలో గల నిజాంసాగర్ కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకున్నారు. కెనాల్ నుంచి లక్ష్మి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. శవ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు. మృతురాలికి భర్త నర్సయ్య, కొడుకు, కూతురు ఉన్నారు.

చోరీ సొమ్ము రికవరీ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఓ ఇంట్లో ఇటీవల చోరీ జరుగగా.. చోరీకి సంబందించిన సొమ్ము రికవరీ చేసినట్లు ఎస్సై శంకర్ గురువారం తెలిపారు. వివరాలు ఇలా.. లింగంపేటకు చెందిన చింతకుంట అనిత, తన చిన్న కొడుకుతో ఫిబ్రవరి 24న గండివేట్ గ్రామంలోని బందువుల ఇంటికి వెళ్లింది. భర్త రామకృష్ణ, పెద్దకొడుకు ఇంటి వద్ద ఉన్నారు. ఫంక్షన్ ముగించుకొని ఫిబ్రవరి 28న ఇంటికి చేరుకుంది. గురువారం ఉదయం బట్టల గురించి బీరువా తెరిచి చూడగా సైడ్ లాకర్ పగులగొట్టి ఉంది. అందులో చూడగా బంగారు గుండ్లు 20, ఎనలు 10, పుస్తె, వెండి ఆభరణాలు కనిపించలేదు. వీటితో పాటు ఉన్న బంగారు కమ్మలు అలాగే ఉన్నాయి. బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. లింగంపేట గ్రామానికి చెందిన కుమ్మరి ప్రశాంత్ చోరీ చేసినట్లు గుర్తించామన్నారు. అతని నుంచి చోరీ చేసిన వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

భూ తగాదాలతో మహిళా రైతు ఆత్మహత్యాయత్నం!

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలో భూమి విషయంలో గొడవలు, వేధింపులు భరించలేక ఓ మహిళా రైతు ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని కరక్‌వాడి గ్రామానికి చెందిన మహిళా రైతు సుగుణ కుటుంబంలో గత కొంతకాలంలగా భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. భూమి కోసం సమీప బంధువుల వేధింపులు భరించలేక గురువారం ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే బంధువులు ఆమెను చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడినుంచి సిరిసిల్ల జిల్లాలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

మొరం తవ్వకాలపై వాగ్వాదం



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ గ్రామంలో గురువారం మొరం తవ్వకం విషయంలో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం నెలకొంది. గ్రామంలోని పెద్దగుట్ట నుంచి ఆర్మూర్‌కు చెందిన కొందరు జేసీబీ యంత్రాలతో టేకు చెట్లను తొలగిస్తూ మొరాన్ని తరలిస్తున్నారు. దీంతో గ్రామానికి చెందిన గురడికాపు సభ్యులు జేసీబీ యంత్రాన్ని, టిప్పర్లను గ్రామానికి తరలించారు. కాగా అదే గ్రామానికి చెందిన ఒడ్డెర కులస్తులు గత 40 సంవత్సరాలుగా గుట్ట ప్రాంతంలో తామే కబ్జాలో ఉన్నామని, పట్టాలు ఇవ్వాలని అధికారులకు వినతిపత్రాలు సైతం అందజేశామన్నారు. ప్రస్తుతం భూమిని చదును చేసుకుంటున్నామని గురడికాపు సభ్యులతో వాగ్వాదానికి దిగారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ఒడ్డెర కులస్తులు తెలిపారు. గురడికాపు సంఘం సభ్యులు మాట్లాడుతూ.. అక్రమంగా టేకు చెట్లను తొలగిస్తూ మొరం తవ్వకాలు చేస్తున్నా.. అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం: కాపర్, ఆయిల్ చోరీ



నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండలంలోని మంజీరా నది పరివాహక ప్రాంతంలోగల పొలాల్లోని ఎనిమిది ట్రాన్స్‌ఫార్మర్లను బుధవారం గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. అనంతరం ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఆయిల్, రాగి తీగను ఎత్తుకెళ్లారు. సీఎం సభ కోసం రెండు రోజులుగా విద్యుత్ నిలిపివేసి మరమ్మతులు చేసుకునే పనిలో సిబ్బంది ఉండగా.. చోరీ జరిగి ఉండొచ్చని రైతులు అభిప్రాయ పడుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీటి విలువ సుమారు రూ.4లక్షల వరకు ఉంటుందని అధికారులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యా సమాచారం..

■ 5న సీవోఈసెట్ ప్రవేశ పరీక్ష

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి సంబంధించిన ప్రవేశపరీక్ష సీవోఈసెట్ –2023 ఈ నెల 5న నిర్వహించనున్నట్లు నిజామాబాద్ ఆర్‌సీవో మేరి యేసుపాదం గురువారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు.

■ టీజీ యూజీసెట్ ప్రవేశ పరీక్ష..

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో 2023 –24 విద్యా సంవత్సరానికి ప్రథమ సంవత్సరం డిగ్రీ ప్రవేశానికి సంబందించిన ప్రవేశ పరీక్ష టీజీయూజీ సెట్ –2023 ఈ నెల 5న జరుగుతుందని సంస్థ ఆర్‌సీవో మేరి యేసుపాదం తెలిపారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షల హాల్‌టికెట్‌లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. పరీక్ష కేంద్రాలను గుర్తించడంలో ఇబ్బందులుంటే, హాల్‌టికెట్‌లో ముద్రించిన చీఫ్ సూపరిండెంట్ మొబైల్ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చన్నారు.

■ ముగిసిన ఇంటర్ ప్రాక్టికల్స్

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో గురువారం ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ముగిశాయి. ఫిబ్రవరి 15న పరీక్షలు ప్రారంభం కాగా, మూడు దశలలో కొనసాగాయి. చివరి రోజు పరీక్షల్లో 27 మంది గైర్హాజరు అయ్యారు. జనరల్ విద్యార్థులు ఉదయం 57మందికి గాను 54మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకేషనల్ 201 మంది విద్యార్థులకు గాను 177 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు జనరల్ విద్యార్థులు 6కు 6మంది హాజరయ్యారు. ఒకేషనల్ 55మంది విద్యార్థులకు 55 మంది హాజరయ్యారు . జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

■ 15నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు..

ఈనెల 15నుంచి ఇంటర్ వార్షిక పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 54 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 4న పరీక్షలు ముగియనున్నాయి.

■ 'గిరిరాజ్' డిగ్రీ ఫలితాలు విడుదల

నిజామాబాద్‌అర్బన్: గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఐదవ సెమిస్టర్, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను గురువారం తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని అరుణ విడుదల చేశారు. కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి, భారతరాజ్ ఆధ్వర్యంలో బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ మూడో, ఐదవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. మూడో సెమిస్టర్‌లో మొత్తం 1173 మంది పరీక్షలకు హాజరు కాగా 782 మంది ఉత్తీర్ణులయ్యారు. 66.65% ఉత్తీర్ణత నమోదయ్యింది. ఐదవ సెమిస్టర్‌లో 1143 మంది విద్యార్థులు హాజరుకాగా 896 మంది ఉత్తీర్ణులయ్యారు. 78.39% ఉత్తీర్ణత నమోదయ్యింది. విద్యార్థులు రీవాల్యుయేషన్, రీకౌంటింగ్ కోసం ఈనెల 6వరకు కళాశాల పరీక్షల విభాగంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు,

■ 4న వాటర్ స్పోర్ట్స్ అకాడమిలో ప్రవేశాలకు ఎంపికలు

కామారెడ్డి అర్బన్: గిరిజన సంక్షేమశాఖ బోయినపల్లి వాటర్‌స్పోర్ట్స్ అకాడమిలో 2023–24 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశానికి ఈనెల 4న కామారెడ్డి ఇందిరాగాంధీ స్టేడియంలో జిల్లాస్థాయి ఎంపికలుంటాయని జిల్లా గిరిజన సంక్షేమాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల 11ఏళ్లలోపు గిరిజన విద్యార్థులు ఎంపికలకు హాజరు కావాలని తెలిపారు. హాజరయ్యే విద్యార్థులు 4వ తరగతి ప్రొగ్రెస్‌కార్డు, బోనఫైడ్, జనన, కుల ధ్రువీకరణ ప్రతాలు, ఆధార్, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు తీసుకుని రావాలని సూచించారు. వివరాలకు కలెక్టరేట్‌లోని 208 గదిలో సంప్రదించవచ్చన్నారు.

■ 16 నుంచి పీజీ సెమిస్టర్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ సెమిస్టర్ రెగ్యులర్ థియరీ పరీక్షలు ఈ నెల 16నుంచి ప్రారంభమై 27న ముగుస్తాయని కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, బీఎల్‌ఎస్సీ, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ (ఏపీఈ, ఐపీసీహెచ్, ఐఎంబీఏ)కోర్సులకు సంబంధించి మొదటి, మూడవ సెమిస్టర్స్, ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం మొదటిసెమిస్టర్, ఇంటిగ్రేటెడ్ కోర్సుల 5వ సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయన్నారు. తెయూ పరిధిలోని అన్ని అనుబంధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. వివరాలకు తెలంగాణయూనివర్సిటీ వెబ్‌సైట్ www. telanganauniversity. ac. in ను సందర్శించాలని ఆమె సూచించారు.

■ ఏప్రిల్ 16న 'మోడల్' ప్రవేశ పరీక్ష

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని మోడల్ స్కూల్స్‌లో ప్రవేశాల కోసం ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 4న ఉన్న హాల్‌టికెట్లు డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఆరో తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 16న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఏడో తరగతి నుంచి పదో తరగతిలో ప్రవేశాల కోసం అదేరోజు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

స్వీట్ బాగోలేదని గొడవ

- స్వీట్‌హోం నిర్వాహకుడిని గాయపర్చిన చెరుకు నరికే కూలీలు
- అడ్డువచ్చిన పోలీసులపై సైతం దాడి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలోని ఓ స్వీట్‌హోంలో స్వీట్ బాగోలేదని కొనుగోలుదారులు దుకాణ యజమానితో గొడవపడ్డారు. ఈ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రంలో నివాసం ఉంటున్న చెరుకు నరికే కూలీలు(గిరిజనులు) గురువారం శ్రీ బాలాజీ స్వీట్ హోంలో స్వీట్‌ను కొనుగోలు చేశారు. ఆ తర్వాత స్వీట్ బాగోలేదని వాపస్ తీసుకోవాలని కూలీలు స్వీట్‌హోం నిర్వాహకుడు కరణ్‌తో వాగ్వాదానికి దిగారు. దీంతో మాట మాట పెరిగి గొడవకు దారితీసింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఇరువురిని సముదాయించే ప్రయత్నం చేయగా కూలీలు పోలీసులపై కూడా దాడి చేశారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఘర్షణలో స్వీట్ హోం నిర్వాహకుడి చేతి విరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

రోడ్డు దాటుతుండగా ఢీకొన్న కారు-బైక్

- ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు





మృతిచెందిన సంగన్ బసప్ప.. గాయపడ్డ రాజు



నుజ్జునుజ్జయిన బైక్

మద్నూర్(జుక్కల్): మండలంలోని మేనూర్ వద్దగల జాతీయ రహదారి 161 దాటుతుండగా బైక్, కారు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై కృష్ణారెడ్డి, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. డోంగ్లీ మండలంలోని దోతి గ్రామానికి చెందిన రాజుపటేల్, సంగన్ బసప్ప(65) గురువారం ఉదయం బైక్‌పై మద్నూర్‌కు బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో వారు మేనూర్ వద్ద గల జాతీయ రహదారి 161 దాటుతుండగా అదే దారిలో ఎదురుగా వస్తున్న ఏర్టిగా కారు ఎదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్ వెనకాల కూర్చున్న సంగన్ బసప్ప తలకి తీవ్ర గాయాలై, అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న రాజు పటేల్ హెల్మెట్ పెట్టుకోవడంతో ప్రాణాలతో బయట పడ్డా డు. తీవ్రంగా గాయాలు కావడంతో మద్నూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. దే గ్లూర్ నుంచి హైదరాబాద్ వైపు వేగంగా వెళ్తున్న ఏ ర్టిగా కారును గమనించకుండ రోడ్డు దాటుతుండటంతో ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బైక్‌ను ఢీకొన్న గుర్తుతెలియని వాహనం

- నలుగురికి గాయాలు



గాయపడ్డ బాలాజీ

బాల్కొండ: మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44ను క్రాస్ చేస్తుండగా బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న నలుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మహారాష్ట్రకు చెందిన బాలాజీ ముప్కాల్ మండలం కొత్తపల్లిలో పాలేరుగా పని చేస్తూ, నివసిస్తున్నాడు. గురువారం తన పెద్దకుమారుడి పుట్టినరోజు సందర్భంగా కొత్త బట్టల కొనుగోలు కోసం భార్య కవిత, చిన్న కుమారుడు గురురాజ్, పెద్దకుమారుడు మాధవ్‌తో కలిసి బైక్‌పై ఆర్మూర్‌కు బయలుదేరాడు. బాల్కొండ శివారులోని జాతీయ రహదారి క్రాస్ చేస్తుండగా వారి బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈప్రమాదంలో బాలాజీకి, చిన్న కుమారుడికి కాళ్లు విరిగాయి. పెద్ద కుమారుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. భార్య కాలుకు గాయమైంది. వెంటనే క్షతగాత్రులను జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై హత్యాయత్నం కేసులో ఐదేళ్ల జైలు

బోధన్: భార్యపై హత్యాయత్నం చేసిన కేసులో భర్తకు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.వంద జరిమానా విధిస్తు బోధన్ కోర్టు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి దేవన్ అజయ్ కుమార్ గురువారం తీర్పు ఇచ్చారు. జరిమాన కట్టని యెడల మరో పక్షం రోజులు జైలు శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. అడిషన్ పబ్లిక్ ప్యాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య తెలిపిన వివరాలు ఇలా.. బోధన్‌లోని హనుమాన్‌టెకిడి కాలనీకి చెందిన జ్యోతితో మహారాష్ట్ర ప్రాంతంలోని ధర్మాబాద్ తాలూకా పరిధిలోగల యావతి గ్రామానికి చెందిన కాలేవార్ శంకర్ గౌడ్‌తో 2017లో పెళ్లి జరిగింది. ఆ తర్వాత అదనపు కట్నం కోసం శంకర్‌గౌడ్ తన భార్యను వేధింసాగాడు. ఈక్రమంలో 7ఫిబ్రవరి 2019న ఎనిమిదినెలల గర్భిణిగా ఉన్న జ్యోతిని బోధన్‌లోని అత్తగారింటికి వచ్చి వదిలి వెళ్లాడు. అదేరోజు సాయంత్రం అత్తగారింటికి వచ్చిన శంకర్‌గౌడ్ వెంట తెచ్చుకున్న కూరగాయల కత్తితో భార్య జ్యోతి గొంతు కోసి హత్య చేయాలనే ప్రయత్నం చేశాడు. అక్కడే ఉన్న జ్యోతి తల్లీ పుష్ప (శంకర్‌గౌడ్ అత్త) అడ్డుకోగా, ఆమెపై దాడికి పాల్పడ్డాడు. అనంతరం తల్లీకూతుర్లు బోధన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టులో విచారణ అనంతరం జడ్జి తీర్పు ఇచ్చారు.